# 8. శ్రమ ఒకరిదీ...

"రే రాగోలూ... పేడదిబ్బ తోలి పెట్టాలా?" అరక్కిపోయివచ్చి, ఎద్దుల్ని మేకులకి కట్టేస్తున్న రాగోల్ని అడిగాడు నరసిమ్లు.

"నీ పొలం దగ్గిరా దాపూ కాదు గదరా! దాదాపు మూడు మైళ్ళు పోయి రావాలి. నా వల్ల కాదు గానీ ఇంకెవుర్నన్నా అడగరేయ్!"

"అట్టంటే యట్రా? నీకు ఏదో ఒక పని ఎగదోస్తాలేరా!"

కొద్దిసేపు ఆలోచించి "అయితే సరే! ఎన్ని బళ్ళు అయిద్దేంది నీ దిబ్బ?" అడిగాడు రాగోలు.

"ఒక బర్రే, దూడ దగ్గిర కసువే గదరా! ఐదారు బళ్ళు అయిద్దేమో!"

"నీ ఐదారు బళ్ళు దిబ్బమట్టి తోలి పెడతా కానీ నాకు వారం రోజులు పనికి రారా! నా దిబ్బ కూడా తోలుకుంటా. నాది ఇరవై బళ్ళు అయిద్ది!"

"ఎన్ని బళ్ళు అయితే మాల్లేరా! వారం రోజులు నీకు పనికివస్తాగా! మరి రేపుట్నించీ తోల్దామా?" అడిగాడు నరసిమ్లు.

"రేప్పొద్దున కూడా అరకపని ఉందిరా! రేపు మాయిటిపూట నించీ తోల్దాం!"

"అట్నే చేద్దాంలే! బర్రెని ఇప్పాల్రా, వస్తా!" అని నరసిమ్లు వెళ్ళిపోయాడు.

తన పేడదిబ్బ ఆరుబళ్ళు అయిద్ది. తన పొలానికి పోయి రావాలంటే వంద రూపాయలు లేనిదే ఏ బండివాడూ ఎద్దులు కట్టడు. తన ఆరుబళ్ళమట్టికీ ఆరు వందలు ఇవ్వాలి. రాగోలుకి వారం రోజులు పనికిపోతే తనకి ఆరు వందలు మిగిలినట్టే అనుకున్నాడు నరసిమ్లు.

సుబాబుల్, జామాయిల్ చెట్లు కొట్టడానికి పోతూ కూలిమనిషి ఎవరూ దొరకడంలేదు. వారం రోజుల నించీ పేడ దిబ్బ తోల్దాం అనుకుంటూనే బండికి పోసేవాళ్ళు ఎవరూ దొరక్క ఆగిపోవాల్సి వచ్చింది. నరసిమ్ముకి మూడు రోజులు తోలిపెడితే తనకి వారం రోజులు పనికివస్తాడు. నరసిమ్ము గట్టిగా పనిచేసేవాడు. తన పొలం దగ్గిరే కాబట్టి రోజూ నాలుగైదు బండ్లు లెక్కన నాలుగు రోజులు మట్టిమొత్తం తోలుకుని, మూడు రోజులు చేలల్లో చెట్లు కొట్టిస్తే సరి అనుకున్నాడు రాగోలు.

నరిసిమ్ముకి రెండెకరాలు సొంత పొలం ఉంది. ఇద్దరు కూతుళ్ళూ, ఒక కొడుకు.

రాగోలుకి ఏడెకరాలు సొంత పొలం, ఎద్దుల ఎగసాయం ఉంది.

మరుసటిరోజు మాయిటిపూట మొదలుపెట్టి మూడు రోజులు ఇద్దరూ పేడదిబ్బ తోలారు.

"చేలో జమ్మిమొక్కలు అట్టఉండయ్యేందిరా? కొట్టకపోయా?" రాగోలు అడిగాడు.

"మట్టి తోలుకుని తరువాత వాటిని పొడుస్తారా!" అన్నాడు నరసిమ్ము.

నరసిమ్ము దిబ్బ తోలడం అయిన తరువాత రాగోలు దిబ్బ మొదలుపెట్టారు.

బాగా వేకువ జామునే లేచి నరసిమ్ము పనికి వస్తున్నాడు.

వారం రోజులు రాగోలు పనికిపోయి బాకీ చెల్లు పెట్టాడు నరసిమ్ము.

* * *

రోహిణీ కార్తె. రోళ్ళు కూడా బద్దలయ్యే ఎండలు.

"ఓమాయ్ రత్తమ్మా... సీసాలో నీళ్ళుపోసి ఇయ్యమ్మా! చేలోకిపోయి జమ్మి మొక్కలు తవ్వి పొడవాలి!" సిమెంట్ గోతాం దారాలతో చేంతాడు వేయాలని పురిపెట్టుకుని, గోతాలూ, దారాలూ, పురి అన్నీ సర్దుతూ కూతురికి చెప్పాడు నరసిమ్ము.

"ఎండ ఎక్కువగా ఉందిగా నానా! కూసేపు ఆగిపోకూడదూ?"

"కూసేపు ఆగిపోతే ఇంక పొద్దు ఏం ఉండబోయింది ఆడ? అంతదూరం పోయేసరికి సరిపోద్దియేల!"

రత్తమ్మ అంతకుముందు ఎక్కడో మినరల్ వాటర్‌కి వచ్చిన ఖాళీ బాటిల్ సంపాదించుకు వచ్చింది. కుండలో నించి ఆ సీసాలో మంచినీళ్ళు పోసి ఇచ్చింది.

ఎండకి నీళ్ళు వెచ్చబడకుండా సీసాకి తడిగుడ్డ చుట్టుకుని, గడ్డపార భుజాన వేసుకుని నరసిమ్లు వడివడిగా కదిలివెళ్ళి పోయాడు.

చేలో జమ్మిమొక్కలు ఎక్కువగా ఉన్నాయి.

ప్రతిఏడూ పంటలు వేయడానికి ముందు మొక్కల దగ్గర తవ్వి, వాటిని తీసేస్తే ఆ ఏటికి అడ్డుగా ఉండవు. భూమిలో వాటి వేళ్ళు చాలా లోతుగా ఉండటంతో తరువాత ఏటికి మళ్ళీ వస్తాయి.

నరసిమ్లు చద్దితాగి చీకటితోనే వెళ్ళి ఎండపడేవరకూ మొక్కలు పొడిచివచ్చేవాడు. మాయిటి పూటా అదేపని. పైరు మీద అడ్డం రాకుండా లోతుగా తవ్వి గడ్డపారతో పొడిచాడు. ఆ పని మూడు రోజులు పట్టింది.

తరువాత రెండురోజులు వెళ్ళి తోలిన నయ్యిమట్టి మొత్తం పొలంలో చదరంగా చిమ్మాడు.

వెంటనే పొలాన్ని నాగళ్ళతో దున్నించాలి. వానపడితే తోలినమట్టి, పేడ వాననీటికి కొట్టుకుపోతుంది.

మరుసటి రోజు పొద్దున్నే ట్రాక్టరు వేణు వాళ్ళింటికి వెళ్ళాడు నరసిమ్లు.

ఆయన అరుగుమీద కూర్చుని వేప్పుల్లతో పళ్ళు తోముకుంటూ అడిగాడు.

"ఏం నరసిమ్లా... ఏందీ వచ్చావు?"

"చేను దున్ని పెట్టాల యేణూ!"

"ఎన్ని నాగళ్ళు ఏందీ?"

"రెండు నాగళ్ళ దుక్కి పడాల. చేనంతా గరిక కుమ్మెలూ, తుంగా దరిద్రంగా ఉంది. ఇప్పుడు రెండు నాగళ్ళు యేస్తేకానీ ఈ బెట్టకి చావదు"

"సరే, డ్రైవర్‌కి చెప్పి టాక్టర్ పంపిస్తాలే. సందకాడ ఇయ్యాల డబ్బు!"

"ఎకరానికి ఎంతా?"

"రెండు నాగళ్ళు అయితే ఐదొందలు"

"అంత రేటంట యేణూ?"

"ఇయ్యాల కొత్త ఏముందీ? నిరుట్నించీ ఐదొందలేగా! ఆయిల్‌కి ధరలు తెగపెంచేరు! ఈ రేటు కూడా మాకు పెద్దగా గిట్టుబాటు కాదు. టాక్టర్ ఉందని ఊరకపెట్టకుండా దున్నుకోడమే!"

నిలబడి మాట్లాడుతున్న నరసిమ్లు వెళ్ళి వేణు పక్కన అరుగు మీద కూర్చుని మెల్లగా అన్నాడు "డబ్బులు లేవు గద యేణూ?"

"....లేవు అనవాకు. ఇయ్యటానికి పేణం వప్పదు అను!"

"అట్టంటావు యేంది యేణూ? ఉంటే పిల్లలేమన్నా పెదతయ్యా, ఇయ్యటానికేం?"

"నువ్వా? నీ అంత మొండోడు మన ఊరు మొత్తం మీద ఉండాడూ? అసలు జలమలో ఎవరికైనా నువ్వు నీ చేతులతో రూపాయి ఇచ్చి ఎరిగుండా?"

"సరే అనూ... నువ్వు డాబా కట్టిస్తన్నావంటగా! మొన్న గుణార్థం చేసావని అన్నారు!"

"అయితే ఏందంట?"

"నీకు పని ఉండదూ? నీ డబ్బు చెల్లు పోయిందాకా వచ్చి నువ్వు చెప్పిన పని చేస్తా! నాకు మాత్రం సుద్ధంగా టాక్టరు దున్ని పెట్టు!"

గోడకాళ్లు తియ్యాలి. లెట్రిన్ గుంటలు తవ్వాలి. ఇంటికి చేసే పని చాలా ఉంది. నరసిమ్లు వళ్లు దాచుకోకుండా గట్టిగా చేసేవాడు. కాళ్లకాడికి వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకోవడం ఎందుకూ?

"రా అయితే! రోజుకి డెబ్బై రూపాయలు ఇస్తా కూలి!"

" నీ ఇష్టం వచ్చినంత ఇయ్యి. నీ బాదిగ చెల్లుపోయిందాకా చేస్తా!"

"డ్రైవరు ఎక్కడికో పోయాడు. అతను వచ్చింతరువాత టాక్టరు మీ ఇంటికి పంపిస్తా! నువ్వు ఎక్కడికీ పోవాకు!"

"సరే" అని నరసిమ్లు ఇంటికి వచ్చాడు.

చాలాసేపటి తరువాత డ్రైవర్ ట్రాక్టర్ తీసుకువచ్చి ఇంటిముందు ఆపి హారన్ కొట్టాడు.

నరసిమ్లు ట్రాక్టరు ఎక్కి వెళ్ళి, దగ్గరుండి పొలాన్ని బాగా దున్నించుకున్నాడు.

* * *

జూన్ నెల... కుండపోత వానలు.

పొలాలు పదును అయ్యాయి.

రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి.

నరసిమ్లు తన పొలంలో కందిపంట వేయాలనుకున్నాడు. రాగోలు వాళ్ళింటికి వెళ్ళాడు.

"శే రాగోలూ... కంది ఎద పెట్టార్రా?"

"నేను కూడా కందీ, పచ్చ పెసరా, గొడ్లు మేతా ఎదపెట్టుకోవాల్రా! ఎదపెట్టే మనిషి ఎవురూ దొరకలా! నీ కోసం మీ ఇంటికి వద్దామనుకుంటున్నా! రెండు మూడు రోజులు రారా! మా ఎద అయిపోగానే నీ చేను ఎదపెట్టి పెడతాను!"

"యేణోళ్ళ డాబా పనికి పోతన్నారా?"

"ఈ వానలో ఇయ్యాలా, రేపూ ఏం పని ఉండిద్దిలేరా? బురద బురదగా ఉంటే ఏం పని చేపిస్తాడు?"

"వాళ్ళింటికి పోయి ఏ వైనం కనుక్కుని వచ్చి చెపతారా? మజ్జెలో మానుకుంటే బాగుండదు. వాళ్ళకి పని లేకపోతే వచ్చి ఎదపెడతా! నిన్నా మొన్న కూడా వాళ్ళకి పనికిపోయారా! ఏ వైనం కనుక్కుని వస్తా!" అని నరసిమ్లు ఇంటికి వచ్చాడు.

అంతలో ట్రాక్టర్ డ్రైవర్ వచ్చి నాలుగు రోజులు పని లేదని వేణు చెప్పమన్నాడని చెప్పాడు.

నరసిమ్లు మూడు రోజులు రాగోలు వాళ్ళకి ఎదపెట్టి తరువాత తన రెండెకరాలలో కంది ఎద పెట్టుకున్నాడు. వాళ్ళు ఇద్దరూ సావాసంగా కూడా ఉంటారు.

"కందిలో పెసరో, ఏదో ఒకటి కలిపి ఎద పెట్టుకోక పోయావంట్రా?" అరకతోల్తా అడిగాడు రాగోలు.

"అడివి పందుల దెబ్బకి పచ్చ పెసర పెట్టినా ఏం పండబోయిందీ? కంది చాల్లేరా! పందులు ఏ పైర్నయినా ఉంచుతున్నయ్యా?" అన్నాడు నరసిమ్లు.

వారం రోజులకి కంది మొలిచి సాళ్ళు పట్టి కనబడుతున్నాయి.

రోజు మార్చి రోజు నరసిమ్లు పొద్దుటి పూటో, మాయిటి పూటో ఒక జామున వచ్చి చేను చూసి పోతున్నాడు.

వాళ్ల చేను డొంక పక్కనే ఉంటుంది. ఒకరోజు చేలోకి వచ్చి చూస్తే బరిగొడ్లు అక్కడక్కడా పడి తిన్న జాడలు కనపడ్డాయి.

"ఓరి వీళ్ళపాసుగాలా! పిల్ల గాడిదలు గొడ్లు దగ్గరికి వచ్చి చేలో తోలేరట్టుగా ఉంది. వస్తానో, పోతానో గొడ్లు పడతానే ఉంటయ్! ముళ్ళ కంప కొట్టకపోతే లాభం లేదు!" అనుకున్నాడు.

మరుసటిరోజు వచ్చి వాగులో ఉన్న జపాన్ తుమ్మ చెట్లు కొట్టి ఆ మండల్ని చేలో డొంక పక్కన ఆ చివరినించీ ఈ చివర వరకూ పాతాడు. జపాన్ తుమ్మచెట్లు కొట్టడం, వాటిని పాతడం మూడు రోజులు పట్టింది.

ఇరవై రోజులకి చేలో కలుపు వచ్చింది.

"నువ్వూ, పిల్లలూ పోయి చేలో కలుపు తియ్యండే! మొక్కప్పుడే తీసుకుంటే తేలిగ్గా ఉండిద్ది!" భార్య తో అన్నాడు నరసిమ్లు.

"మొన్న కూలికి పోయి వస్తా, మన చేను చూసాలే! కలుపు వచ్చింది, తీద్దామనుకున్నా! రేపట్నించీ పోయి లాగుతాం కలుపు!" అంది కుమారి.

తరువాత రోజు కుమారీ, ఆమె ఇద్దరు పిల్లలూ వెళ్ళి కలుపు తియ్యటం మొదలు పెట్టారు.

ఆడ పిల్లలకి ఒకరికి పదమూడు ఏళ్ళూ, ఒకరికి పదిహేను ఏళ్ళూ ముగ్గురూ కలిసి ఐదు రోజుల్లో కలుపు మొత్తం తీసిపారేసారు.

కంది నవనవలాడుతూ పెరుగుతోంది.

నెల రోజులకి సత్తువ మందు ఎదపెట్టాలి. రాగోలు దగ్గరికి వెళ్లాడు నరసిమ్ము.

"కందిసాళ్లలో సత్తవ ఎద పెట్టాల్రా! డిఎపి రెండు గోతాలూ, యూరియా ఒక గోతం ఎద పెడదామనుకుంటున్నా! ఎప్పుడు ఎద పెడతావురా రాగోలూ?"

"మా పొలం దున్నుకుంటున్నారా ఇప్పుడు. రెండు రోజుల్లో ఎప్పుడు వచ్చేదీ చెపతాలే! మందు కట్టలు తీసకొచ్చి ఇంటో పడేసుకో ముందు! నాకు ఖాళీ దొరికి వచ్చిన రోజు ఊళ్లో మందు కట్టలు లేకపోతే అగచాట్లమారి పనయిద్ది!" అన్నాడు రాగోలు.

నరసిమ్ము ఇంటికి వెళ్ళి దబ్బు తీసుకుపోయి మందు బస్తాలు కొని, రిక్షా మీద ఇంటికి చేర్చుకున్నాడు.

రాగోలు అరకకు ఖాళీ దొరికిన రోజు వచ్చాడు. ఇద్దరూ కలిసి మందు కట్టలు బండిమీద వేసుకుని తీసుకుపోయి అరకతో చేలో ఎద పెట్టారు.

రెండు నెలలకి మళ్ళీ కలుపు వచ్చింది. కుమారీ, పిల్లలూ వెళ్ళితీశారు.

వర్షాలకి కంది చక్కగా పెరుగుతోంది. పెరుగుదలలో రోజు రోజుకీ తేడా కనపడుతోంది.

ఐదు నెలలకి కంది, మనిషి ఎత్తుకు మించి పెరిగింది.

అక్కడక్కడా కందికి మొగ్గ వస్తున్నది. అయితే వచ్చిన మొగ్గని వచ్చినట్లే పురుగు తినేస్తున్నది.

"మందు యేస్తేనే అన్నా మొగ్గ నిలబడేది. లేకపోతే మొగ్గ మన కంటికి కనపడకుండానే పురుగు తినేసిద్ది!" అన్నాడు పొరుగు చేను నారాయణ.

అది నిజమే! మందేసిన చేనుకీ, వేయని చేనుకీ తేడా కనబడుతున్నది.

పోయిన యేదాది వాడి, మూలన పడేసిన స్ప్రేయర్‌ను మెకానిక్ దగ్గరికి తీసుకుపోయి బాగుచేయించాడు.

తరువాత రోజు పెద్ద కూతురు స్ప్రేయర్ బాటిళ్ళలో మందూ, నీళ్ళూ పోసి కలిపి, స్ప్రేయర్‌కి బాటిల్ తగిలిస్తుంటే నరసిమ్ము మందువేశాడు. సాలుకి రెండు వైపులా స్థాయిగా కొమ్మలకి చూపెట్టుకుంటూ వేయడంతో చీకటి పడేవరకూ పట్టింది.

ఆ రోజు రాత్రి పెద్ద కూతురు పెద్దగా ఏడుస్తూ లేచింది.

వళ్ళంతా నొప్పులు. ముఖమంతా మంటలు. కళ్ళలో కారంబోసినట్లు మంట తీసుకున్నాయి. నరసిమ్లు పరిస్థితీ అలాగే ఉంది. తెల్లవార్లూ తండ్రికీ కూతురికీ నిద్రపట్టక అలాగే గడిపారు. తెల్లవారాక నొప్పులు కొంత తగ్గాయి. అది మందు ప్రభావం.

నాలుగు రోజులకి వచ్చిచూస్తే మొగ్గ కొంత వచ్చింది. అక్కడక్కడా మొగ్గ పూతగా అయింది. మందువేసినప్పటికంటే పురుగు ఎక్కువ కనపడింది.

ఐదోరోజు మళ్ళీ స్ప్రేయర్ ఎత్తాడు.

ఈ సారి బాటిల్స్‌లో మందుపోసి స్ప్రేయర్‌కి తగిలించడానికి భార్య వచ్చింది. స్ప్రేయర్ బ్యాటరీతో పనిచేస్తుంది. స్ప్రేయర్‌లో మందు పొగమాదిరిగా వస్తుంది. గాలి ఎటువైపు వీస్తే అటువైపు పొగమాదిరి మందు పడుతుంది. అనేకసార్లు గాలికి నరసిమ్లు ముఖంమీద మందు పడుతూనే ఉంది.

ఆ రోజు రాత్రి బాటిళ్ళలో మందు పోసిన భార్యకీ, మందు వేసిన భర్తకీ ఇద్దరికీ కంటిమీద కునుకులేదు. ముఖం మంటలు ఎత్తుతుంటే ఇద్దరూ ముఖాలకి కొబ్బరినూనె దట్టంగా రాసుకున్నారు. అయినా అది ఏం పనిచేయలేదు.

మందు వేసినరోజు కాకుండా మధ్యలో నాలుగు రోజులు వదిలి ఐదో రోజు మళ్ళీ మందు వేస్తున్నారు.

మూడు వారాలు నిండాయి. పచ్చగా పూతవచ్చింది. పురుగుకూడా ఎక్కువే వచ్చింది.

"ఎంత మందు పోసినా లాభంలేదే! పురుగు మాత్రం చావడంలా! మందు దారి మందుదే, పురుగు దారి పురుగుదే అయింది. పురుగు ఏరాల్సిందే!" ఇంటి దగ్గర భార్యతో చెప్పాడు నరసిమ్లు.

చాలామంది రైతులు కూలీల్ని పెట్టి పురుగు ఏరిస్తున్నారు.

మరుసటి రోజు పొద్దున్నే కుమారీ, ఇద్దరు కూతుళ్ళూ మూడు సీసాలు ఎత్తుకుని చేలోకి వచ్చారు. ఏరిన పురుగు ఏరినట్టుగా సీసాలో వేసుకున్నారు. చీకటి పడేటప్పటికి ఒక్కొక్కరు రెండేసి సీసాలు పురుగు ఏరారు. అప్పటికి చేలో కొద్దిభాగమే అయింది.

నరసిమ్లు మరుసటి రోజు మందు వేశాడు.

ఒకరోజు మందువేయడం, నాలుగు రోజులు పురుగు ఏరడం!

నిలబడి, దీక్షగా చూస్తూ పురుగు ఏరాలి. పొద్దస్తమానం నిలబడి ఉండడం వల్ల కాళ్ళు పీకుతుంటాయి. గుడ్లప్పగించి పురుగు వెదుకులాడడం వల్ల కనుగుడ్ల పీకుతుంటాయి.

ఇక మందు వేసినరోజు వళ్ళు నొప్పులతో రాత్రికి జాగారం తప్పదు.

సంక్రాంతి నాటికి కందిచేను పచ్చపూల వనం అయిపోయింది. విపరీతంగా వచ్చిన పూత ధాటికి దూరంనించి చూస్తే పచ్చగా, మనోహరంగా, కన్నుల పండుగగా, అద్భుతంగా ఉంది చేను.

దాదాపు నలభై అయిదు, యాభై రోజులు మందువేయడం, పురుగు ఏరడం నిరంతరంగా, అవిశ్రాంతంగా, అలుపూ సొలుపూ లేకుండా చేశారు.

శ్రమ ఫలించింది. కంది విరగపండింది.

"రేపట్నించీ ఇద్దరం పోయి కంది కోద్దామే! పండిన పంట తొందరగా ఇంటికి చేర్చుకుంటే బాగుండిద్ది!" అన్నాడు నరసిమ్లు.

ఫిబ్రవరి పద్నాలుగు.

భార్యాభర్తలు చీకటితోనే వెళ్ళి కంది కోయడం మొదలుపెట్టారు. పొద్దుటి జామునే కోత కోయాలి. ఎండపడితే కాయరాల్తుంది.

ఇద్దరూ ఆరు రోజులు కంది కోశారు.

మళ్ళీ ఇద్దరూ కలిసే నాలుగురోజులు కోసిన కంది కంపని మోపులు కట్టారు. రెండు వందల డెబ్బై కందిమోపులు అయ్యాయి.

సావాసగాడు రాగోలు ఇంటికి వెళ్ళాడు నరసిమ్లు.

"రే రాగోలూ... కందిమోపులు ఊళ్ళోకి తోలాల్రా!"

"నాకూపనేం లేదురా! రేపు ఏకువజామునే పోదాం" అన్నాడు రాగోలు.

మరో మనిషిని తీసుకుని ముగ్గురూ వేకువనే బండికట్టుకుని పొలం వెళ్ళారు. బండికి పట్టిన వరకూ మోపులు వేసుకుని వచ్చారు. మొత్తం నాలుగు బండ్లు అయ్యాయి. పొద్దుటిపూట నాలుగు రోజులు తోలారు.

ఇక కంది కొట్టాలి. ఈ పనికి చాలా మంది పడతారు. చాలా కూలి అవుతుంది. కూలివాళ్ళకి డబ్బు ఇవ్వాల్సి వస్తుందని కుమారీ, నరసిమ్లూ బదుళ్ళు పోవడం మొదలుపెట్టారు.

పొద్దుటి పూట కందికంపని కల్లంలో వేస్తారు. ఎండ బాగా వచ్చిన తరువాత, ఒక మంచం వేసి, ఆ మంచం మీద తలుపు చెక్కలు వేసి ఆ చెక్కలకి పెట్టి కంది కంపని కొడతారు. కాయల నించి గింజలు రాల్తాయి. అలా మనిషి పదిమోపులు మించి కొట్టలేరు.

ఇద్దరూ పదకొండు రోజులు బదుళ్ళకి పోయారు.

తరువాత వాళ్ళ కందికల్లంలో వేశారు. రెండు రోజులు పట్టింది కందికొట్టడం! రోజూ పదకొండు మంది బదులు వచ్చారు.

పది గోతాలు కందులు అయ్యాయి.

పంట బాగా పండిందని కుమారీ, నరసిమ్లూ సంతోషపడ్డారు.

ఫిబ్రవరి పద్నాలుగు నించీ కంది కోయడం, బదుళ్ళకి పోవడం ఇలా నెల రోజులపాటు ఆ దంపతులకి నాగా లేదు.

మార్చి నెలాఖరు. కందులు అమ్ముదామని కొట్టుదగ్గరికి వెళ్ళాడు నరసిమ్లు.

కొట్టు యజమాని నాగార్జున కాలిమీద కాలువేసుకు కూర్చుని సిగరెట్ తాగుతూ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నాడు. ఎదురుగా మందుల కంపెనీ రిప్రజెంటేటివ్‌లు ఇద్దరు కూర్చుని ఉంటే వాళ్ళ మాటలు నవ్వుతూ వింటున్నాడు.

నరసిమ్లు బయట పంచలో బెంచ్‌మీద కొద్దిసేపు కూర్చుని, వెళ్ళాల్సిన పని గుర్తొచ్చి, లేచి వాకిట్లో నిలబడి అడిగాడు. "కందులు అమ్ముతాం నాగార్జునా... రేటెంత?"

అతను నరసిమ్లు మాటలు ఆలకించలేదు. మళ్ళీ అడిగాడు నరసిమ్లు.

"క్యాష్ అయితే పదమూడు వందలూ, నెలరోజుల సైట్ అయితే పదమూడు వందల యాభై" చెప్పాడు నాగార్జున

"కేష్ బేరానికి మావి పట్టుబడి చేయండి" చెప్పి నరసిమ్లు వచ్చేశాడు.

మధ్యాహ్నం ముఠావాళ్ళు వచ్చి, రెండు జల్లెడలు పట్టి, కాటాలు వేసుకుని సరుకుని రిక్షాలమీద గోడవున్‌కు తీసుకుపోయారు. నరసిమ్లుకి మూడోరోజు పదమూడువేలు డబ్బు ఇచ్చాడు నాగార్జున.

మందులూ, మాకులూ ఇతర ఖర్చులకి సగం డబ్బు పోయినా నికరంగా సగం డబ్బు మిగిలినట్లే అని ఆ దంపతులు ఎంతో ఆనందించారు.

నెల రోజులకి నాగార్జున తను కొన్న వాటిని క్వింటాల్ పదిహేడు వందలు చేసి మిల్లర్స్‌కి అమ్ముకున్నాడు.

ఒక్క నరసిమ్లు కందులలోనే నాగార్జునకి నాలుగువేలు మిగిలాయి.

పొలంలో పిచ్చిచెట్లు కొట్టీ, నయ్యిమట్టి తోలుకునీ, ఆమట్టి చిమ్ముకునీ, దున్నుకునీ, విత్తనం వేసీ, కంప కొట్టుకునీ, కలుపుతీసీ,సత్తువ ఎదపెట్టుకునీ, భయంకరమూ, ఘోరమూ అయిన పెస్టిసైడ్ కాలుష్యాన్ని వళ్ళంతా హూనం

హానం అవుతుండగా ఆరసాయనాలు వేసుకునీ, నిట్టు నిలువు కాళ్ళ మీద నిలబడి కనిగుడ్లు పీక్కుపోతుండగా పురుగు ఏరీ, చీకటిలోనే వెళ్ళిపంట కోసుకుని, అది కల్లంలో వేసినూర్చుకునీ, కూలి అవుతుందనే వుద్దేశంతో డబ్బు మిగుల్చు కోవడానికి బదుళ్ళకిపోయీ, అవసరమైన పెట్టుబడి పెట్టీ, ఇలా ఏడాది పొడవునా ఎండా వాననకుండా, పగలూ రేయనకుండా ఆరుగాలం తల్లీ బిడ్డలతో సహా మొత్తం ఇంటిల్లిపాదీ చెమటలు ధారపోస్తూ, కాయకష్టం చేస్తూ రెక్కలు ముక్కలు చేసుకున్న నరసిమ్లు కుటుంబానికి పంటమీద ఎంత మిగిలాయో ఒక్క నిమిషం పనిచేయకుండా, కాలు కదపకుండా, చెమటబొట్టు చిందించకుండా, శ్రమంటే ఏమిటో తెలియకుండా దర్జాగా కాలిమీద కాలు వేసుకుని ఠీవిగా కూర్చున్న నాగార్జునకి కూడా ఆ పంట మీద దాదాపు అంతే మిగిలాయి.

అదే విషాదం !

'ఈనాడు' ఆదివారం – **20 జనవరి 2002**